వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు

- ఆర్మూర్‌లో నిమజ్జన స్థలాలను పరిశీలించిన అధికారులు
- ఇబ్బందులు లేకుండా చర్యలు


ఆర్మూర్‌లో గూండ్ల చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఆర్మూర్ టౌన్: దేశంలో వైభవంగా జరిగే ఉత్సవాల్లో వినాయక చవితి ఒకటి. చిన్నా,పెద్దా తేడా లేకుండా యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు పెద్ద ఎత్తున ఈ ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ఈనెల 27 నుంచి వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ...

ఆర్మూర్ పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు విద్యుత్, పోలీస్, మున్సిపల్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో సిద్ధమవుతున్నాయి. పట్టణంలోని రహదారులు, విద్యుత్ దీపాలు, చెరువుల పరిసరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఆర్మూర్ గూండ్ల చెరువులో ప్రతి ఏడాది విగ్రహాల నిమజ్జనం ఎక్కువగా జరుతుంది. బుధవారం సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, తహసీల్దార్ సత్యనారాయణ, ఏసీపీ వెంకటేశ్వర్లు, విద్యుత్ డీఈ రాజేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ రాజు ఆ స్థలాన్ని పరిశీలించారు. నిమజ్జన సమయంలో ఇన్–అవుట్ మార్గాలను సిద్ధం చేయాలని సబ్‌కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి. నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు త్వరగా పూర్తి చేస్తాం. అన్ని శాఖల అధికారులు అందుబాటు ఉండి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూస్తాం.

– అభిగ్యాన్ మాల్వియా, అదనపు కలెక్టర్

భారీగా పోలీసుల బందోబస్తు



వినాయక నవరాత్రి ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పెద్ద డీజేలకు అనుమతి లేదు. పదిఫీట్ల వినాయకులను ఏర్పాటు చేస్తు బాగుంటుంది. మండపాల నిర్వహకులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

– వెంకటేశ్వర‌రెడ్డి, ఏసీపీ, ఆర్మూర్

విద్యుత్ అధికారులను సంప్రదించాలి



వినాయక మండపాల వద్ద విగ్రహ ప్రతిష్ఠ సమయంలో విద్యుత్ అధికారులను తప్పనిసరిగా సంప్రదించాలి. అవసరమైతే తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తాం. విద్యుత్ తీగలకు నేరుగా వైర్లు వేసి కరెంటు వాడకూడదు. అది ప్రమాదకరం. డిమాండ్ డ్రాఫ్ట్ చెల్లిస్తే విద్యుత్ సరఫరా లైన్ అందిస్తాం. విద్యుత్ తీగలతో అప్రమత్తంగా ఉండాలి.

– రాజేశ్వర్‌రావు, డీఈ, ఆర్మూర్

రోడ్ల మరమ్మతులు చేపడుతాం



నవరాత్రి ఉత్సవాలకు ముందు రోడ్ల మరమ్మతులు చేపడతాం. నిమజ్జనం సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

– రాజు, మున్సిపల్ కమిషనర్,ఆర్మూర్

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి


ఆర్మూర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు


కమ్మర్‌పల్లిలో ..

వేల్పూర్/కమ్మర్‌పల్లి/ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/మాక్లూర్/మోర్తాడ్ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామంలో, కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో,ఆర్మూర్ పట్టణంలో, కోటగిరి మండల కేంద్రంలో, మాక్లూర్ మండలంలోని కల్లెడి గ్రామంలో, భీమ్‌గల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు రాజీవ్ గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.


కోటగిరిలో రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద..


భీమ్‌గల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

ఆర్మూర్ అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వండి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కోరిన కాంగ్రెస్ నాయకులు


సీతక్కతో సమావేశమైన ఆర్మూర్ నాయకులు

ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కోరారు. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సీతక్కను బుధవారం కలిశారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నిధుల మంజూరుకు మంత్రి హామీ ఇచ్చారని వినయ్‌రెడ్డి చెప్పారు. సమావేశంలో ఆర్మూర్ పట్టణ, వివిధ మండలాల కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు వెంకట్రామ్‌రెడ్డి, లింబాద్రి గౌడ్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న బోధనోపకరణాల మేళా


ముప్కాల్ పాఠశాలలో మేళాను పరిశీలిస్తున్న ఎంఈవో రవి


సాటాపూర్ పాఠశాలలో నిర్వహించిన మేళాను పరిశీలిస్తున్న ఎంఈవో ఆంజనేయులు

వేల్పూర్/బాల్కొండ/పెర్కిట్/రెంజల్ : విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించడం కోసం బోధనోపకరణాలు చాలా ఉపయోగపడుతాయని ఎంఈవోలు పేర్కొన్నారు. వేల్పూర్ హైస్కూలులో బుధవారం మండలస్థాయి బోధనోపకరణాల మేళాను ఎంఈవో రేణుక ప్రారంభించారు. అన్ని పాఠశాలలు తయారు చేసిన వివిధ ప్రయోగాలను పరిశీలించి, వాటిలో పది ఉత్తమ బోధనోపకరణాలను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేశారు. ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బోధనోపకరణాల మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో జక్కుల రవి ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. ఆలూర్ మండల కేంద్రంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో బోధనోపకరణాల మేళా ఏర్పాటు చేశారు. ఎంఈవో నరేందర్ ముఖ్య అతిథిగా హాజరై మేళాను ప్రారంభించారు. రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో నిర్వహించిన మేళాను ఎంఈవో ఆంజనేయులు ప్రారంభించారు. ఈబోధనోపకరణాల మేళా ఆకట్టుకుంది. బోధన ఉపకరణాలతో విద్యార్థులకు పాఠ్యాంశాలుల సులభంగా అర్థమవుతాయని ఎంఈవోలు పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ బోధనోపకరణాలను ఎంపిక చేసి ఉపాధ్యాయులకు జ్ఞాపికలతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో కాంప్లెక్సు హెచ్ఎంలు హెచ్‌ఎంలు , ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రాకాసీపేట జెడ్పీహెచ్ఎస్‌లో వృక్షా బంధన్


రాకాసీపేట పాఠశాలలో వృక్షానికి రాఖీ కడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బోధన్: చెట్ల సంరక్షణతోనే పర్యావరణానికి మేలు జరుగుతోందని, పట్టణ కేంద్రంలోని రాకాసీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలచంద్రం అన్నారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో వృక్షా బంధన్ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు చెట్లకు రాఖీ కట్టారు.ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడారు. చెట్ల రక్షణ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాల్సిన సామాజిక బాధ్యతను గుర్తించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

బోధన్: ఎడపల్లి మండలం వడ్డేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ నిజామాబాద్ బ్రాంచ్ అధికారులు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)లో భాగంగా సుమారు రూ.60 వేలు విలువ చేసే 20 డ్యూయల్ (డెస్క్) బెంచ్‌లు, మూడు టేబుళ్లను వితరణ చేశారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో వితరణ కార్యక్రమం నిర్వహించగా, ఆ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వెంకటేష్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.బ్రాంచ్ మేనేజర్ అరవింద్, పాఠశాల హెచ్ఎం అర్చన, టీచర్లు సౌజన్య, ప్రవీణ్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి శాఖ సభ్యులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి


రుద్రూర్‌లో మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్

రుద్రూరు/బాల్కొండ/బోధన్ : వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. బుధవారం రుద్రూర్ మండల కేంద్రంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. గణేశ్ మండపాల వద్ద నియమ నిబంధనలు పాటించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు.మెండోరా మండలంలో విగ్రహాల ఏర్పాటు అనుమతుల కోసం దరఖాస్తు చేసిన అనంతరం సదరు విగ్రహాలకు జియో ట్యాగింగ్ చేయడం జరుగుతుందని సీఐ శ్రీధర్ రెడ్డి. తెలిపారు. మెండోరాలో నిర్వహించిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో రూరల్ సీఐ పాల్గొని మాట్లాడారు.ఈకార్యక్రమాల్లో రుద్రూరు సీఐ కృష్ణ, ఎస్సై సాయన్న, తహసీల్దార్ తారా బాయి విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డొంకేశ్వర్ ఎంపీడీవోగా లింగం బాధ్యతల స్వీకరణ


ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న బుక్య లింగం

డొంకేశ్వర్(ఆర్మూర్): డిచ్‌పల్లి సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న బుక్య లింగంకు ఎంపీడీవోగా బాధ్యతలిస్తూ జెడ్పీ సీఈవో సాయాగౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన బుధవారం డొంకేశ్వర్‌కు వచ్చి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. కాగా, డొంకేశ్వర్ మండలానికి అధికారులు ఎవరొచ్చినా నిలకడగా ఉండడం లేదు. నెల తిరగకముందే వచ్చిన అధికారులు బదిలీపై వెళ్లిపోతున్నారు. ఏప్రిల్ 3న డొంకేశ్వర్‌లో మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటైంది. మోర్తాడ్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న బ్రహ్మానందం డొంకేశ్వర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఇరవై రోజులే పని చేసి బదిలీ చేసుకున్నారు. నందిపేట్ ఎంపీవో లక్ష్మీప్రసాద్‌కు డొంకేశ్వర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలిచ్చారు. రెండు మండలాల్లో పని చేయడం కష్టంగా మారడంతో లక్ష్మీప్రసాద్‌ను తప్పించారు. ఈఅధికారి ఎన్ని రోజులు పని చేస్తారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మహాలక్ష్మి ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ


భూమిపూజ చేస్తున్న నాయకులు

బోధన్: గ్రామాల అభివృద్ధి పనుల విషయంలో అన్ని పార్టీలను కలుపుకుని ముందుకెళ్తామని బీజేపీ ఎడపల్లి మండల అధ్యక్షుడు కోల ఇంద్రకరణ్ అన్నారు.జిల్లా ఎంపీ ధర్మపురి అర్వింద్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.70 లక్షలు మంజూరు చేయగా, ఎడపల్లి మండలానికి రూ.16 లక్షలు కేటాయించారని పేర్కొన్నారు. బుధవారం ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామంలో మహాలక్ష్మి ఆలయ ప్రహరీ నిర్మాణానికి ఆయన పార్టీ మండల నాయకులు, గ్రామపెద్దలతో కలిసి భూమి పూజ చేశారు. ప్రహరీ నిర్మాణానికి ఎంపీ రూ.3 లక్షలు మంజూరు చేశారని నాయకులు తెలిపారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గెంట శ్రీనివాస్, కార్యదర్శి రాకేష్ గౌడ్, నాయకులు బాలరాజ్‌గౌడ్, రాజేందర్, కేదరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వర్ని ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు


ఆర్మూర్ రాంమందిర్ పాఠశాలలో..

బాల్కొండ/ఆర్మూర్‌టౌన్/వర్ని/రెంజల్ : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని పీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో సెప్టెంబర్ 1న పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే సీపీఎస్ ధర్నా వాల్‌పోస్టర్లను బుధవారం ముప్కాల్ మండలకేంద్రంలో, ఆర్మూర్‌లోని జిల్లా పరిషత్ రాంమందిర్ పాఠశాలలో, సాటాపూర్ హైస్కూల్‌లో, వర్ని ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా పీఆర్‌టీయూ ముప్కాల్, వర్ని, రెంజల్ మండలాల, ఆర్మూర్ అర్బన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, నవీన్, కృష్ణ వరప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్, నర్సింహరెడ్డి, సోమలింగంగౌడ్, కిషోర్‌కుమార్‌లు మాట్లాడారు. ఈకార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి పీహెచ్‌డీ పట్టా

జాన్కంపేట్ వాసికి..


పట్టా అందుకుంటున్న తలారి స్నేహ

వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్ గ్రామానికి చెందిన తలారి స్నేహకు పీహెచ్‌డీ పట్టా లభించింది. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవంలో ఇస్రో ఛైర్మన్ నారాయణన్, ఉస్మానియా వైస్ చాన్సలర్ కుమార్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. స్నేహ ఇంజినీరింగ్ విభాగంలో 'మెటామెటీరియల్ ఇన్‌స్పైర్డ్, ఫిల్టరింగ్ ఆంటెనా యూజింగ్ ఫినిట్ డిఫరెన్స్ టైమ్ డొమైన్ టెక్నిక్ ఫర్ 5జీ అప్లికేషన్స్' అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పించారు. తమ గ్రామానికి చెందిన స్నేహ పీహెచ్‌డీ పట్టా అందుకోవడంపై శ్రేయోభిలాషులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

చేపూర్ వాసికి..


డాక్టరేట్ పట్టాతో సారంగి రమేష్

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన సారంగి రమేష్‌కు ఫార్మసీ రంగంలో డాక్టరేట్ లభించింది. ఉస్మానియ యూనివర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణన్‌లు రమేష్‌కు డాక్టరేట్‌తో సన్మానించారు. కాగా రమేష్ 'డిజైన్, సింథెసిస్ అండ్ ఫార్మకాలోలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ నావెల్ బీఐఎస్ ఇంటర్‌క్యాలేటర్స్ ఆజ్ పాసిబుల్ యాంటి క్యాన్సర్ ఏజెంట్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం రమేష్ మహారాష్ట్ర నాందేడ్ జిల్లాలో శ్రీ సాంబాజీ ఫార్మసీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రమేష్‌కు డాక్టరేట్ రావడంపై రిటైర్డు హెచ్ఎం జంగం అశోక్, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళా డిగ్రీ కాలేజీ పై ఎమ్మెల్యే నిర్లక్ష్యం వీడాలి


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

వర్ని : బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్నిలో మహిళా డిగ్రీ కాలేజీ ప్రారంభించి, భవనం నిర్మించడం మరిచిపోయారని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు విమర్శించారు. బుధవారం వర్ని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోటయ్య క్యాంపులో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి, ఏళ్లు గడుస్తున్న అధికారులు నిరుపేదలకు ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. బోధన్ నుంచి బీదర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటులో ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డితో పాటు, ఎంపీ సురేష్ షెట్కార్, బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వంపై ఎందుకు పోరాటం చేయరని మండిపడ్డారు. జిల్లాలో రైతులు ఎరువుల కొరతతో ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం ఎరువుల కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. పార్టీ ఏరియా కార్యదర్శి నన్నే సాబ్, నాయకులు గంగాధర్, లక్ష్మణ్, రాములు, నాగనాథ్, శంకర్, మారయ్య, హన్మండ్లు ఉన్నారు.

క్లుప్తంగా

పొలాల్లో ఇసుకమేట



వర్ని: మండలంలోని మల్లారం శివారులో గల పొలాల్లో కంకర, ఇసుక మేట వేసింది. భారీ వర్షాలు కురియడంతో మల్లారం అటవీ ప్రాంతం నుంచి భారీ వరద రోడ్డుపై నుంచి రావడంతో హైవే పనుల కోసం ఉంచిన ఇసుక, కంకర నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చి పొలాల్లో మేట వేసింది. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఇసుకమేటలు వేసిందని, నష్టపోయిన పంటకు ఆర్‌అండ్‌బీ అధికారులు లేదా కాంట్రాక్టర్ పరిహారం చెల్లించాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా విగ్రహాల పునప్రతిష్ఠ



బోధన్: సాలూర మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలో బుధవారం మహాలక్ష్మి, పోచమ్మ దేవతామూర్తుల విగ్రహ పునప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బుధవారం గ్రామంలోని ఆలయ ప్రాంగణంలో అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు,హోమం నిర్వహించారు. బోధన్ ఏఎంసీ చైర్మన్ చీల శంకర్ లావణ్య దంపతులు, గ్రామ పోలీస్ పటేల్ శ్యాంసుందర్,మల్లికార్జున్ బాసరే, సాలూర గ్రామ పోలీస్ పటేల్ వెంకట్ పటేల్, గంగాధర్, శంకర్, దత్తాత్రి, గ్రామపెద్దలు,మహిళలు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి



మోర్తాడ్: వర్షాలు కురుస్తున్న దృష్ట్యా గ్రామాలలో పరిశుభ్రతపై కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది దృష్టి సారించాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని బెజ్జోరాలో పర్యటించారు. అనంతరం భీమ్‌గల్ మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాలలో పరిశుభ్రతకు లోటు రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీవో జావిద్ అలీ పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



కమ్మర్‌పల్లి: ప్రభుత్వం నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని కమ్మర్‌పల్లి మండల ప్రత్యేకాధికారి తిరుమల ప్రసాద్ ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం ఏవైజీ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల పథకం, ఓటరు జాబితా, ఉపాధి హామీ పథకం తదితర సంక్షేమ, అభివృద్ధి పనులపై సమీక్షించారు. అంతకుముందు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం తనిఖీ చేసి హాజరు పట్టికను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. నాగాపూర్ శివారులోని వరద కాలువ హెడ్ రెగ్యులేటరీ వద్ద నీటి విడుదలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజశ్రీనివాస్ ఉన్నారు.

చదువులో ముందుండాలి



రుద్రూర్: విద్యార్థి సంఘం నాయకులు ఉద్యమంతో పాటు చదువులో కూడా ముందు ఉండాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ ఇందూర్ జిల్లా కన్వీనర్ దర్శనం ప్రవీణ్ సూచించారు. బుధవారం వర్ని శాఖ ఆధ్వర్యంలో మోడల్ కళాశాలలో కళాశాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రవీణ్ మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ పోరాటాలు చేస్తుందన్నారు. పెండింగ్ లో ఉన్న రూ.8300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కళాశాల నూతన అధ్యక్షులుగా చింటూ కార్యదర్శిగా శ్రావ్య, ఉపాధ్యక్షులుగా సుప్రియ, అయాన్, ప్రసాద్, నిహారికలను ఎన్నుకున్నారు.

సంక్షిప్తం

జూనియర్ కళాశాలకు గ్రీన్ బోర్డుల బహూకరణ

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బుధవారం కుచుకుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్ద గ్రీన్ బోర్డులను బహూకరించారు. బీజేపీ నాయకులు రెంజెర్ల గంగారాం,ప్రవీణ్‌కుమార్, బీజీ గంగారాం, అధ్యాపకులు మధు, వెంకటేష్, సుమతి, వైష్ణవి, స్వాతి, గంగారాం, శ్రీహరి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కోసం ఎల్‌వోసీ అందజేత

మోర్తాడ్: భీమ్‌గల్ మండలం కుప్కల్‌కు చెందిన బాజం రమేష్ గుండెసంబంధిత వ్యాధితో బాధపడుతుండగా అతని ఆపరేషన్ కోసం రూ.1.70లక్షల ఎల్‌వోసీని కాంగ్రెస్ నాయకులు బుధవారం అందజేశారు. తమ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి చొరవ తీసుకుని బాధితునికి సీఎం కార్యాలయం నుంచి ఎల్‌వోసీ మంజూరు చేయించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్

రెంజల్(బోధన్): రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని ట్రాన్స్‌కో ఏఈ మగ్దుం అలీ తెలిపారు. బుధవారం రెంజల్‌లో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు సబ్ ఇంజినీర్ అజార్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ లింగంయాదవ్, లైన్‌మెన్ శ్రీనివాస్, ఏఎల్ఎంలు మగ్దుం సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రెంజల్: బోధన్ మండలం హంగర్గా శివారు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు రెంజల్ మండలం నీలా శివారులో ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. అధికారుల అనుమతులు లేకుండా బుధవారం సాయంత్రం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. డ్రైవర్‌తో పాటు ట్రాక్టర్ యజమాని పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోస్రా మండలంలో టిప్పర్..

వర్ని: మోస్రా మండలంలోని చే నెంబర్ తండా అటవీ ప్రాంతంలో అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్టు తహసీల్దార్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం గుట్ట ప్రాంతం నుంచి మొరం తరలిస్తుండగా టిప్పర్‌ను పట్టుకొని వర్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సొంత ఖర్చులతో మరుగుదొడ్ల నిర్మాణం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాం గ్రామంలో గ్రామానికి చెందిన ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు సోమ రవి తన సొంత ఖర్చులతో పోచమ్మ తల్లి దేవాలయం వద్ద మరుగుదొడ్లను నిర్మించారు. దీంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ సోమ రవి పేరుతో బుధవారం శిలఫలకాన్ని ఏర్పాటు చేశారు.వీడీసీ సభ్యులు ముత్తెన్న, కనకగౌడ్, రవి, శేఖర్, గంగారాం, సాయి కుమార్, భోజన్న, బండారి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలపై రాజకీయాలు సరికాదు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో సరిపడా స్థలం ఉన్నప్పటికీ ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుపై అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు చేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శ్రవణ్ అన్నారు. బుధవారం ఆర్మూర్ ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆర్మూర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో ఎమ్మెల్యే ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు.